క్లుప్తంగా

చురుగ్గా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు



బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

టెక్కలి రూరల్: నౌపడ రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అమృత భారత్ పథకంలో భాగంగా ఈ స్టేషన్‌లో రెండో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజురయ్యాయి. ఇందులో భాగంగా సోమవారం భారీ క్రేన్లను వినియోగించి పనులు చేపట్టారు. ట్రాక్ పైనుంచి ఉన్న విద్యుత్ లైన్లకు రైళ్ల రాకపోకలు లేని సమయంలో సరఫరాను నిలిపివేసి పనులు చేశారు.

బాధిత కుటుంబానికి అండగా..



బాధిత కుటుంబానికి సాయాన్ని అందజేస్తున్న సంఘ సభ్యులు

కవిటి: మండలంలోని మాణిక్యపురం గ్రామానికి చెందిన కార్మికుడు దేవరాజ్ ఆకస్మికంగా మరణించారు. దీంతో అతని కుటుంబు ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ఈ విషయం తెలుసుకున్న కవిటి మండల లైటింగ్ అండ్ సౌండింగ్ సంఘం సభ్యులు అండగా నిలిచారు. 25 వేల రూపాయలను సేకరించారు. సోమవారం బాధితుని కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం 25 వేల రూపాయల సాయాన్ని అందజేశారు. సాయం అందించి సంఘ సభ్యులను గ్రామపెద్దలు దేవరాజ్‌సాహూ, సంతోష్ సాహూ, కంసు శ్రీను, బృందావన్‌దొళాయి, వెంకటరమణ, ఢిల్లీమజ్జి అభినందించారు.

గ్రంథాలయంలో పుస్తక పఠనం



పుస్తక పఠనంలో చిన్నారులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం చిన్నారులతో కథల పుస్తకాలను చదివించారు. గత నెల 15వ తేదీ నుంచి ప్రారంభమైన విజ్ఞాన శిబిరాలు ఈ నెల ఏడో తేదీతో ముగియనున్నాయి. గ్రంథాలయానికి వచ్చిన చిన్నారులకు చాక్లెట్లను పంచిపెట్టారు. గ్రంథాలయ అధికారి వై.రాంబాబు, సీఆర్పీ ఉర్నాన అప్పలరాజు, పోతనపల్లి బాలరాజు, ముంగుర పద్మావతి, పాఠకులు ఉన్నారు.

పింఛన్ సొమ్ము కోసం పడిగాపులు!



బ్యాంకు వద్ద వేచి ఉన్న పింఛన్‌దారులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 13వ వార్డు గాంధీనగర్ రోడ్డులో ఉన్న యూనియన్ బ్యాంకు వద్ద సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి పింఛన్‌దారులు పడిగాపులు కాశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఈ నెలకు సంబంధించి సామాజిక పింఛన్ల మొత్తాన్ని ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. దీంతో పింఛన్ డబ్బులను తీసుకోవడానికి లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం నుంచే బ్యాంకులకు చేరుకొని డబ్బుల కోసం క్యూ కడుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

జి.సిగడాం: సీజనల్ వ్యాధుల పట్ల వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని బాతువ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రతిజ్ఞ శర్మ సూచించారు. మండలంలోని డీఆర్‌వలస ఆరోగ్య కేంద్రంలో రోగులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ మంచాలకు పరిమితమైన రోగులకు ఇంటివద్దకు వెళ్లి వైద్యసేవలను అందిస్తున్నామని వెల్లడించారు. వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు. ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మెళియాపుట్టి: వేసవి సెలవుల్లో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి అనురాధ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. వ్యాసరచన పోటీల ద్వారా విద్యలో మరింత పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. చదవటం ద్వారా చక్కటి ప్రతిభ పెరుగుతుందన్నారు. ప్రతీ విద్యార్థి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకుని పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు.

● ఆర్థిక సాయం



గార మండలం మత్స్యలేశం గ్రామానికి చెందిన గుంటు జ్యోత్స్న అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సంతబొమ్మాళి మండలం ఉమిలాడ గ్రామస్తులు ఆమెకు అండగా నిలిచారు. రూ. 65,300 సేకరించారు. ఈ మొత్తాన్ని ఆమెకు గ్రామపెద్దల సమక్షంలో సోమవారం అందజేసి ఆదర్శంగా నిలిచారు.

– సంతబొమ్మాళి

● నేత్ర వైద్య శిబిరం



జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని లక్కవలస గ్రామంలో సోమవారం ఏర్పాటు చేశారు. 78 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 38 మందికి శస్త్రచికిత్సకు వైద్యులు ఎంపిక చేశారు. కార్యక్రమంలో అప్తాలమిక్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, క్యాంపు కోఆర్డినేటర్ టి.రామారావు, స్థానిక పారామెడికల్ సిబ్బంది ఉన్నారు.

– సంతబొమ్మాళి

● వ్యాసరచన పోటీలు



టెక్కలిలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వాతావరణ కాలుష్యం-నియంత్రణ అనే అంశంపై జరిగిన పోటీల్లో పిల్లలు ఆసక్తిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జి.రూపావతి పాల్గొన్నారు.

–టెక్కలి

కౌంటింగ్ కేంద్రానికి పోస్టల్ బ్యాలెట్ బాక్సులు



స్ట్రాంగ్ రూమ్ నుంచి లెక్కింపు కేంద్రానికి తరలిస్తున్న పోస్టల్ బ్యాలెట్ బాక్సులు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను సోమవారం జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న శివానీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలకు అధికారులు తరలించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెస్‌తో పాటు ఇతర రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలో భద్రత సిబ్బంది నేతృత్వంలో 24 బాక్సులను తరలించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.అజయ్, నాయకులు యు.విశ్వనాథం, పి.వైకుంఠరావు, కె.జీవన్, టీడీపీ నుంచి బి.శేషు, కె.హరివరప్రసాద్, కాంగ్రెస్ నుంచి టీబీజీ గుప్తా హాజరయ్యారు.

14 టేబుళ్లు..23 రౌండ్లు!

● టెక్కలి నియోజకవర్గ ఓట్ల లెక్కింపు తీరు

టెక్కలి: శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి సమీపం.. చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో 14 టేబుళ్లు, 23 రౌండ్లలో టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపును చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గత నెల 13వ తేదీన జరిగిన పోలింగ్‌లో టెక్కలి నియోజకవర్గంలోని 315 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 2,36,327 ఓట్లకు గాను 1,86,897 ఓట్లు పోలయ్యాయి. 1,17,816 మంది పురుషులకు గాను 91,326 మంది, అలాగే 1,18,502 మంది మహిళా ఓటర్లకు గాను 95,569 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 315 పోలింగ్ కేంద్రాల పరిధిలో 79.1శాతం పోలింగ్ నమోదైంది. వీటితో పాటు అన్ని రకాల పోస్టల్ బ్యాలెట్ కలుపుకుని 3,369 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ర్యాలీలు నిషేధం



మాట్లాడుతున్న రామారావు

వజ్రపుకొత్తూరు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెలువడే సమయంలో గ్రామాల్లో విజయోత్సవాలు, ర్యాలీలు నిషేధమని వజ్రపుకొత్తూరు ఎస్సై సీహెచ్ రామారావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించమన్నారు. ఎంతటి వారినైనా కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు. బాణసంచా పేల్చడం, వీధుల్లో తిరగడం, వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగామ్ గ్రూపుల్లో రెచ్చగొట్టే పోస్టింగ్‌లు పెట్టడం చేస్తే అడ్మిన్‌తో పాటు మెసేజ్ పోస్టింగ్ చేసిన వ్యక్తిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రధానంగా అక్కుపల్లి, బాతుపురం, డోకులపాడు, చినవంక, కిడిసింగి, వజ్రపుకొత్తూరు, నువ్వలరేవు, మంచినీళ్లపేట, కొండవూరు, కొత్తపేట, గోవిందపురం తదితర సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రతీ గ్రామంపై నిఘా పెంచామని వివరించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

రణస్థలం: ప్రతి ఒక్కరూ మొక్కలునాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. ఓ చిన్నారి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా పతివాడపాలెం శివాలయం ప్రాంగణంలో సోమవారం మొక్కలు నాటారు. హరిబాబు మాట్లాడుతూ భూతాపం బాగా పెరిగిపోయి, దేశంలో పలు నగరాల్లో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పి.తవిటినాయుడు, పి.రమణ, ఆర్.భవాని, ఎం.వి రత్నాకర్ పాల్గొన్నారు.

జీడికి మద్దతు ధర ప్రకటించాలి



మాట్లాడుతున్న రైతాంగ ప్రతినిధులు

పలాస: జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ జీడి రైతాంగ కమిటీ జిల్లా కార్యదర్శి తెప్పల అజయ్‌కుమార్ కోరారు. ఉద్దానం ప్రాంత జీడి రైతాంగానికి ఇచ్చిన హామీని రాబోయే కొత్త ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. జీడి రైతుల కష్టాలను గట్టెక్కించాలని విజ్ఞప్తి చేశారు. గత కొన్ని రోజులుగా పలాస నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం మాకన్నపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. జీడి రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా ఈ పోరాటం జరగుతుందని, ఈ ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోనేరు గురయ్య, నెయ్యల గణపతి, కుత్తుం వినోద్, తవిటయ్య, సాతుపల్లి కృష్ణారావు, నాగేష్, తెప్పల కూర్మారావు ఉన్నారు.

పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలి



కార్యదర్శులతో మాట్లాడుతున్న శివాజీపాణిగ్రాహి

కవిటి: డివిజినల్ పంచాయతీ అధికారి కార్యాలయ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పంచాయతీల్లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటిపన్ను, సీసీ చార్జెస్ వసూళ్ల లక్ష్యాలను శతశాతం సాధించే దిశగా కార్యాచరణను వేగవంతం చేయాలని కవిటి ఈవోపీఆర్డీ శివాజీ పాణిగ్రాహి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించి.. ప్రభుత్వ కార్యక్రమాల అమలుతీరు, ప్రగతిపై సమీక్షించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను వసూళ్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వెక్టార్ కంట్రోల్ యాప్ ప్రాప్తికి ఎప్పటికప్పుడు వచ్చిన ఫిర్యాదులపై పరిష్కారాల్ని చూపడంలో ప్రత్యేక శ్రద్ధవహించాలన్నారు.

గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం



గుంతలో పడిన మూగజీవి

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని పెద్దబొడ్డపాడు పంచాయతీ పరిధిలో గల పలు చెరువులలో అక్రమంగా తవ్విన గుంతలతో ప్రమాదం పొంచి ఉంది. అలాగే మంచినీటి కుళాయిల ఏర్పాటు కోసం గుత్తేదారులు తవ్వకాలు జరిపి నిర్లక్ష్యంగా గుంతలను వదిలి వేయడంతో మూగ జీవాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. సీతాపురంలో నీటి కుళాయి కోసం తవ్వి వదిలేన గుంతలో మూగ జీవి పడి విలవిలలాడింది. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు మూగజీవిని ప్రాణాలతో కాపాడారు. ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జోరుగా పూండి రహదారి పనులు



రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి రహదారికి ఎట్టికేలకు మోక్షం లభించింది. సీఎంవో (ముఖ్యమంత్రి కార్యాలయం హై ఇంపాక్ట్) నిధులు రూ. 2.90 కోట్లు వెచ్చించి పనులు చేపడుతున్నారు. బెండి గేటు జంక్షన్ నుంచి పాతటెక్కలి వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. పూర్తిగా పాడైన ప్రాంతంలో రోడ్డును వెట్‌మిక్స్‌తో ఎత్తు చేసి దానిపై బీటీ రహదారి నిర్మిస్తున్నారు. వారం రోజుల్లో రహదారి పూర్తవుతోందని ఆర్అండ్‌బీ ఏఈఈ డి.విక్రమ్ తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి మంత్రి అప్పలరాజు పూండి రహదారి సమస్యను తీసుకెళ్లడంతో ఈ నిధులు మంజూరైయ్యాయి. పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



సాయాన్ని అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: కిడ్నీ వ్యాధితో మరణించిన స్నేహితుడు కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన మద్దిల జోగారావు రెండు కిడ్నీలు పాడైపోయి ఇటీవల మరణించారు. ఇతనికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ఇంటి పెద్ద మరణంతో వీరు ఆర్థిక ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న బొడ్డపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2003 విద్యా సంవత్సరంలో మృతుడు జోగారావుతో కలిసి పదోతరగతి చదువుకున్న మామిడిపల్లి గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు మద్దిల లింగరాజు, వంకల పాపారావు, పిట్ట జోగారావు, జుత్తు లక్ష్మణరావు, వంకల షణ్ముఖరావు, మద్దిల ధనుంజయ, సార సాంబమూర్తి, జుత్తు శ్రీనివాసరావు, వంకల ధనలక్ష్మి, రాపాక ధమయంతి, సార రాజేశ్వరి పది వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని స్నేహితుడు భార్యకు సోమవారం అందజేశారు.

1800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న సామగ్రితో పోలీసు సిబ్బంది

కాశీబుగ్గ: జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాలతో ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ గంగాధరం పర్యవేక్షణలో పోలీసులు సారా తయారీ కేంద్రాలపై ఆదివారం దాడులు చేసినట్టు పోలీసులు సోమవారం తెలిపారు. మందస మండలం బలియాగాం గ్రామ పరిధిలో చేసిన దాడుల్లో 1800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను, 40 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశామన్నారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎస్ఈబీ సోంపేట స్టేషన్ సిబ్బంది, జిల్లా టాస్క్‌ఫోర్స్, పలాస ఎస్ఈబి అధికారులు ఉన్నారు.

మాజీ సైనికులకు ఉచిత వైద్యసేవలు



ఈసీహెచ్ఎస్ ప్రత్యేక కౌంటర్ ప్రారంభోత్సవంలో మాజీ సైనికులు, ఆస్పత్రి ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో మాజీ సైనికులకు మెడికవర్ ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆస్పత్రిలో ఈసీహెచ్ఎస్ ప్రత్యేక కౌంటర్‌ను డాక్టర్ దానేటి శ్రీధర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ సైనికులు, కుటుంబీకులు మెడీకవర్‌లో ఈనెల ఐదో తేదీ నుంచి 24/7 వైద్య సేవలను అందిపుచ్చుకోచ్చన్నారు. వైద్యానికి అయ్యే ఖర్చు అంతా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆస్పత్రి యాజమాన్యానికి చెల్లిస్తుందన్నారు. ఇక్కడ మాజీ సైనికులకు ప్రత్యేక కౌంటర్ ఉంటుందని చెప్పారు. మాజీ సైనిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు కటకం మాట్లాడుతూ.. రెండేళ్లుగా మెడికవర్ ఆస్పత్రిలో వైద్య సేవల కోసం జిల్లా సమాఖ్య తరపున కృషి చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫెడరేషన్ చైర్మన్ గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, గౌరవాధ్యక్షులు బి.సంజీవరావు, తమ్మినేని కృష్ణారావు, ఎస్.ఎల్.రావు, వైస్ ప్రెసిడెంట్ వి.సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీ పి.మురళీధరరావు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎస్.రామకృష్ణ, ట్రెజరర్ ఎం.సింహాచలం, మహిళా సెక్రటరీలు ఎ.లక్ష్మి, కె.జగ్గమ్మ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: రాజాం జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సమ్మర్ క్యాంప్‌లో 14వ (ఏ)బెటాలియన్ జిల్లా ఎన్‌సీసీ విద్యార్థులకు రెడ్‌క్రాస్ సేవలపై అవగాహన కారక్రమం సోమవారం జరిగింది. జూనియర్ రెడ్‌క్రాస్ సభ్యత్వంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 512 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు.

సాగునీటి కాలువలు బాగుచేయాలి



సరుబుజ్జిలి: పూడికపోయిన కాలువను చూపిస్తున్న రైతులు



బూర్జ: జిలి గెడ్డలో పెరుకుపోయిన పిచ్చిమొక్కలు

సరుబుజ్జిలి: వంశధార కుడి ప్రధాన కాలువకు సుభద్రాపురం గ్రామం వద్ద అనుసంధానంగా నిర్మించిన 17ఎల్ పిల్ల కాలువ సక్రమంగా పనిచేయకపోవడం వల్ల రైతులకు సాగునీరు అందక ప్రతి ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుభద్రాపురం వద్ద గల వంశధార కుడి ప్రధాన కాలువ నుంచి సమీపంలో ఉన్న ఇల్లాన్నాయుడు చెరువుకు సాగు నీరు నిండిన తదుపరి దిగువన గల సక్కలపేట, పెద వెంకటాపురం, చినవెంకటాపురం, పాలవలస, అవతరాబాద్, సూర్యనారాయణపురం, రావివలస తదితర గ్రామాలకు చెందిన 8 చెరువులు నింపాలి. రైతులకు అత్యవసర సమయంలో సాగునీరు అందించేందుకు అధికారులు నిర్ణయించారు. ఆయకట్టుకు సాగునీటిని అందించాల్సిన 17ఎల్ పిల్ల కాలువ పూర్తిగా పూడికపోయింది.

గజిలి గెడ్డలో..

బూర్జ: బూర్జ గజిలి గెడ్డలో పూడికలు తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. గజిలి గెడ్డ బిట్–2లో కింద ఏడాది ఉపాధి హామీ పనుల్లో భాగంగా పూడి తతీత పనులు చేపట్టారు. అయినప్పటికీ గజిలి గెడ్డలో పిచ్చి మొక్కలు పెరిగి సాగు నీటికి ఇబ్బందికరంగా మారాయి. రూ.4,72,340లతో చేపట్టిన పనులు అంతంత మాత్రంగానే జరిగాయని స్థానికుల విమర్శిస్తున్నారు. గెడ్డలో పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు

ఎచ్చెర్ల క్యాంపస్: సమగ్ర సర్వశిక్ష పథకం అధికారులు సూచనల మేరకు ఎచ్చెర్ల మండలంలో అన్ని గ్రామాల్లో ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తున్నట్లు సహిత విద్య ఉపాధ్యాయులు సింగిరెడ్డి రమణ, కింతలి అరుణ కుమారి చెప్పారు. ఎచ్చెర్ల భవిత కేంద్రంలో సోమవారం వివరాలు వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు సహకారంతో ఈ సర్వే నిర్వహించి చిన్నారులను గుర్తిస్తున్నట్లు వివరించారు. 18 ఏళ్లలోపు దివ్యాంగులను సైతం గుర్తిస్తున్నట్లు వివరించారు. విద్య, పౌష్టికాహారం అందించటం, రవాణా సౌకర్యం కల్పించటం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి సహాయ పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామ పెద్దలు సైతం సహకరించాలన్నారు.